
సాక్షి గుంటూరు

బుధవారం । 25 । డిసెంబర్ । 2024



ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): శివాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి మంగళవారం పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 575.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,717 క్యూసెక్కులు విడుదలవుతోంది.

పాండురంగడి అలంకరణ



సత్తెనపల్లి: ధనుర్మాసం సందర్భంగా స్థానిక అలివేలుమంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి గుడిలో స్వామిని మంగళవారం పాండురంగడిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

కొండపై గండాలయ్య విగ్రహం ఏర్పాటుపై సమీక్ష



తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి గండాలయ్య స్వామి గుడి అభివృద్ధిపై మంగళవారం కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యాలయంలో మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, గండాలయ్య స్వామి అఖండ జ్యోతి ప్రాంతాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆమె వీక్షించారు. మంగళగిరి కొండపై గండాలయ్య స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. నరసింహస్వామి సన్నిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె అడిగి తెలుసుకున్నారు. గండాలయ్య స్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు ముఖ మండపాలు, మెట్లమార్గం అభివృద్ధి, పార్కింగ్ వసతిపై కమిషనర్ అలీమ్‌బాషాతో చర్చించి ఆ పనులను వెంటనే అమలు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు.

మున్సిపల్ పాఠశాలల్లో 18 మందికి ఉద్యోగోన్నతులు



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని నగరపాలక సంస్థ, పురపాలక పాఠశాలల్లో 18 మంది ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి పొందారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం డీఈఓ సీవీ రేణుక అధ్యక్షతన గుంటూరు నగరపాలక సంస్థతో పాటు వివిధ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రాతిపదికన కౌన్సెలింగ్ ద్వారా స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తెలుగు-3, హిందీ-2, ఇంగ్లిషు-3, సోషల్-5, భౌతికశాస్త్రం-1, జీవశాస్త్రం-2, గణితం-2 పోస్టులను భర్తీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీసీఈబీ కార్యదర్శి ఎ. తిరుమలేష్, సీనియర్ హెచ్ఎంలు జె.రమేష్ కుమార్, గుంటూరు తూర్పు ఎంఈవో-1 అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, ఐటీ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.


తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటెపాడు: గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం మంగళవారం ఉదయం వరకు తొమ్మిది మండలాల్లో జల్లులతో కూడిన తేలికపాటి వర్షం పడింది. అత్యధికంగా కొల్లిపర మండలంలో 4.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా తెనాలి మండలంలో 0.4 మిల్లీమీటర్ల వర్షం పడింది. మండలాలవారీగా దుగ్గిరాల 1.4, పెదనందిపాడు 1.2, చేబ్రోలు 1, గుంటూరు పశ్చిమ 1, కుమాను 1, మంగళగిరి 0.8, పొన్నూరు మండలంలో 0.8 మిల్లీమీటర్లు చొప్పున వర్షం పడింది. మరో రెండు రోజుల పాటు జిల్లాలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి


నరసరావుపేట: జిల్లాలో సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని పల్నాడు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరి కొనుగోలు, రెవెన్యూ సదస్సులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం దిశగా అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. రెవెన్యూ సదస్సులను జయప్రదం చేయాలని కోరారు. ఎప్పటికప్పుడు ప్రజలు, ప్రభుత్వ పనులను సత్వరం పూర్తిచేసి జిల్లాను మొదటి ఐదు స్థానాల్లో ఉంచాలని వివరించారు. డీఆర్వో ఏకా మురళి, ఏడీ సర్వేయర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 150, తూర్పు కెనాల్‌కు 60, నిజాంపట్నం కాలువకు 76, కొమ్మమూరు కాలువకు 1160 క్యూసెక్కులు విడుదల చేశారు.







జయ జీసస్ శుభ క్రిస్మస్

ఊరూవాడా బెత్లెహేమై మురిసినట్టు.. ఆకాశ తారలు ఇల దిగి వచ్చి ఆలయ శిఖరాలపై శోభిల్లినట్టు.. శీతలగాలులే క్రీస్తుగీతాలై చెవులను లయబద్ధంగా తాకినట్టు.. మిణుగురులే విద్యుద్దీపాలై పశువుల పాక చుట్టూ మిలమిలా మెరిసినట్టు.. క్రిస్మస్ సంబరం అంబరాన్నంటింది. క్రీస్తు పుట్టెను బెత్లెహేమందునా.. సంతసమొందుమా.. సార్వజనమా అంటూ గుంటూరు జిల్లా భక్తిపారవశ్యంతో పులకించింది. గుంటూరు నగరంలోని బిషప్ హౌస్‌తోపాటు ఫిరంగిపురం బాల ఏసుదేవాలయం ప్రత్యేక అలంకరణలో తళుకులీనాయి. పలు ప్రాంతాల్లో క్రిస్మస్ ట్రీలు మిరుమిట్లుగొలిపాయి. బహుమతులతో శాంటాక్లాజ్‌లు సందడి చేశారు. – సాక్షి నెట్‌వర్క్

ఖాకీల తీరు అసమంజసం

ఇదెక్కడి న్యాయం!

- నిందితులపైనా, బాధితులపైనా ఒకే సెక్షన్లు
- ఇంట్లో సామగ్రి బయటపడేసి నడి వీధిలోకి గెంటేసిన వారివైపే మొగ్గు!
- అధికార పార్టీ నేతలు చెబితేనే కేసులు!
- లేకపోతే ఎఫ్ఐఆర్ కూడా కట్టని వైనం
- 3 నెలల క్రితం మాజీ మంత్రి విడదల రజిని ఫిర్యాదు
- ఈనెలలో ఐదు ఫిర్యాదులు చేసిన మాజీ మంత్రి అంబటి
- కేసులు నమోదు చేయని పట్టాభిపురం పోలీసులు
- ప్రశ్నించిన నేతలపై ఎదురు కేసులు
- టీడీపీ నేతల చేతుల్లో పోలీసులు బందీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు తావిస్తోంది. నేరం చేసిన వారిపైన, బాధితులపైన ఒకే తరహా సెక్షన్లు నమోదు చేయడం పట్టాభిపురం పోలీసులకే చెల్లింది. పట్టపగలు 50 మంది ఓ ఇంటిపై దాడిచేసి ఇంట్లోని సామగ్రి బయటపడేసి ఓ కుటుంబాన్ని రోడ్డుపాలు చేసి ఆ ఇంటిని ఆక్రమించుకుంటే.. పోలీసులు మొక్కుబడిగా ఇంట్లోకి అక్రమ ప్రవేశం, గాయపరచడం, నేరపూరిత బెదిరింపు వంటి బెయిలబుల్ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. బాధితులపై కూడా అవే సెక్షన్లు పెట్టి 'సమ'న్యాయం చూపించారు. దీంతో ఖాకీల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ నేత దౌర్జన్యం

పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా రోడ్డు శాంతినగర్ 2వ లైన్‌లో నగర డెప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ తాడికొండ ఇన్‌చార్జి వనమా వజ్రబాబు (డైమండ్ బాబు) సోదరి వజ్రకుమారి ఇంట్లోకి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ్‌కిరణ్ ఆదివారం మధ్యాహ్నం సుమారు 50 మంది అనుచరులతో దౌర్జన్యంగా ప్రవేశించిన విషయం తెలిసిందే. వజ్రకుమారి ఇంట్లోని సామగ్రిని బయట పడేయడంతోపాటు ఆ ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళతోపాటు, పసిపిల్లలనూ బయటకు తోసేశారు. ఆ తరువాత టీడీపీ నేతలు, వారి వెంట వచ్చిన అనుచరులు ఆ ఇంట్లోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. ఈ స్థలం విషయంలో 1978 నుంచి ఇద్దరి మధ్య వివాదం నడుస్తోంది. స్వాధీనం అగ్రిమెంట్‌పై అమ్మిన వ్యక్తి తర్వాత రేటు పెరిగిందని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో కొన్నేళ్లుగా కోర్టులలో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ వ్యవహారంతో ఏ మాత్రం సంబంధం లేని టీడీపీ నేత దౌర్జన్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న డైమండ్‌బాబు పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ వేచి ఉన్నా కిందిస్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకున్న సీఐ మాత్రం ఘటనా స్థలానికి రాలేదు. డైమండ్‌బాబు ఘటనా స్థలానికి వచ్చిన తర్వాత అక్కడికి చేరుకున్న సీఐ వీరేంద్రబాబు టీడీపీ నాయకులకు వత్తాసు పలికారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టి డైమండ్‌బాబును బలవంతంగా పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అయితే విజయ్‌కిరణ్ స్టేషన్‌లో తమ అదుపులో ఉన్నాడని, ఇంట్లో ఉన్నవారిని రెవెన్యూ అధికారుల సమక్షంలో బయటకు పిలిపిస్తామని సీఐ మీడియాతో చెప్పారు. అయితే ఆ సమయంలో విజయ్‌కిరణ్ ఘటనా స్థలంలోనే ఉండటం గమనార్హం. ముందుగా పోలీసులతో మాట్లాడుకున్న తర్వాతే విజయ్‌కిరణ్ ఈ దౌర్జన్యానికి పాల్పడినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.



పట్టాభిపురం పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన అంబటి, పార్టీ నేతలు (ఫైల్)

సోషల్ మీడియా కేసుల్లోనూ ఇదే తీరు

సోషల్ మీడియాలో పోస్టుల విషయంలోనూ పట్టాభిపురం పోలీసులు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వైఎస్సార్‌సీపీ నేతలైతే ఒక లెక్క.. అధికార పార్టీ నేతలైతే మరో లెక్క అన్నట్టుగా పోలీసుల వ్యవహారశైలి ఉంది. టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారని 2018లో పోస్ట్ చేసిన వారిని ఒకే కేసులో ఒకే విషయంపై పలుచోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వేధింపులకు పాల్పడుతున్నారు.

ఐ-టీడీపీ పోస్టులపై స్పందించరే!

మాజీ మంత్రులు విడదల రజిని, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన సతీమణి, కుమార్తెలపై ఐ-టీడీపీ సోషల్ మీడియాలో అత్యంత దారుణంగా పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదు చేసినా పోలీసులు బుట్టదాఖలు చేస్తున్నారు. విడదల రజిని ఎస్పీతోపాటు డీజీపీకి ఫిర్యాదు చేసి 55 రోజులైనా ఇప్పటివరకూ కేసు కూడా నమోదు చేయలేదు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతోపాటు తన కుటుంబ సభ్యులపైనా అసభ్య పదజాలంతో ఐ-టీడీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ ఆధారాలతో సహా అంబటి రాంబాబు నవంబర్ 19న పట్టాభిపురం పోలీసు స్టేషన్‌తో పాటు ఎస్పీకి కూడా ఫిర్యాదులు ఇచ్చారు. ఈ ఫిర్యాదుల గురించి ఆయనే స్వయంగా పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన ఫిర్యాదు ఎక్కడివరకు వచ్చిందని అడిగినా పోలీసుల నుంచి సమాధానం లేదు. దీంతో గత మంగళవారం అంబటి పట్టాభిపురం స్టేషన్ ఎదుట బైఠాయించారు. ఇచ్చిన ఫిర్యాదులపై స్పందించని పోలీసులు.. స్టేషన్ ముందు బైఠాయిస్తే ఎదురు కేసు పెట్టారు. డైమండ్‌బాబు విషయంలోనూ ఎంపీ పెమ్మసాని సోదరుడి ప్రమేయంతో సీఐ వారికి అండగా నిలబడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. సీఐ వ్యవహార శైలిపై సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేతలు ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

సమైక్యంగా సమరనాదం

- చుండూరు మండలంలో ఏకతాటిపైకి వైఎస్సార్ సీపీ నేతలు
- గతంలో గ్రూపులతో బలహీనపడిన పార్టీ
- కూటమి ప్రభుత్వంలో అక్రమ కేసులు
- అశోక్‌బాబు చొరవతో వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో పార్టీవర్గాల ఐక్యనినాదం



వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో చుండూరు మండల పార్టీ నేతలు

చుండూరు(తెనాలి): బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం వైఎస్సార్ సీపీ నేతలు ఏకతాటిపైకి వచ్చారు. సమైక్యంగా సమరనాదం మోగించారు. కలిసుంటే కలదు జయమని నినదించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో మంగళవారం తాడేపల్లి వెళ్లి పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశీలకుడు వైవీ సుబ్బారెడ్డిని కలిశారు. ఐక్య నినాదం వినిపించారు.

తొలి నుంచీ వైఎస్సార్ సీపీకి కంచుకోట

చుండూరు మండలం వైఎస్సార్ సీపీకి తొలి నుంచి కంచుకోట. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన డాక్టర్ మేరుగ నాగార్జునకు ఈ మండలంలో 4,800 ఓట్ల ఆధిక్యత లభించింది. తర్వాత జరిగిన పంచాయతీలు, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థులు, మద్దతునిచ్చిన వారే ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వర్గవిభేదాలు పొడచూపాయి. నేతలు గ్రూపులుగా విడిపోయారు. ఈ పరిణామం 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపింది. మండలంలో మెజార్టీ 600కు పడిపోయింది. దీంతో పార్టీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఓటమిపాలయ్యారు. వైఎస్సార్ సీపీ నేతలు వర్గాలుగా విడిపోవడంతో కూటమి ప్రభుత్వం రాగానే టీడీపీ నేతలు రెచ్చిపోయారు. శ్రేణులపై దాడులకు దిగారు. కేసులు పెట్టేలా పోలీసులను పురిగొల్పారు.

అశోక్‌బాబు చొరవతో మళ్లీ ఏకమై

చుండూరు మండలంలో పార్టీ బలహీనపడడానికి గ్రూపు విభేదాలే కారణమని గ్రహించిన నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతల మధ్య సయోధ్యకు చొరవ చూపారు. మండల విస్తృత సమావేశాన్ని ఇటీవల నిర్వహించారు. క్యాడర్ ఇబ్బందులను చర్చించారు. అందరూ ఒకటి కావాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఏకాభిప్రాయాన్ని సాధించారు. పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన అభయం ఇప్పించాలని తలపోశారు. కూటమి అధికారంలోకి రాగానే పార్టీ క్యాడర్‌పై దాడులు, అక్రమ కేసులు వంటి చిల్లర పనులకు దిగిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబే వైఎస్సార్ సీపీని మళ్లీ బలోపేతమయ్యేలా చేశారని అశోక్‌బాబు అభివర్ణించడం విశేషం. అశోక్‌బాబు గ్రామగ్రామాన పర్యటించి క్షేత్రస్థాయిలో కిందిస్థాయి నేతలు అందరి అంగీకారంతో గ్రామ కమిటీలను నియమించారు.

గొప్ప ముందడుగు

వైఎస్సార్ సీపీ నేతలు వర్గవిభేదాలు వీడి మళ్లీ ఏకతాటిపైకి రావడం గొప్ప ముందడుగు. ఇకపై కూటమి అరాచకాలను సహించేది లేదని, సమష్టిగా సమరనాదం పూరిస్తామని నాయకులంతా ఐక్యంగా నినదించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా పరిశీలకుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం కలిసి ఇకపై పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంతా కలుసుండాలని, పార్టీ అండగా ఉంటుందని అభయమిచ్చారు. కార్యక్రమంలో చుండూరు ఎంపీపీ జాలాది రూబేను, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అన్నపరెడ్డి రఘురామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ వుయ్యూరు అప్పిరెడ్డి, జాలాది రమేష్, దాట్ల మోహన్‌రెడ్డి, అన్నపరెడ్డి వీరారెడ్డి, ఈమని వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తికి బదులు మిర్చి నమోదు

ప్రత్తిపాడుకు చెందిన ఓ రైతు ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేశాడు. అరకొరగా దిగుబడులు వచ్చాయి. సీసీఐ ద్వారా గిట్టుబాటు ధరకు పంట అమ్ముకుందామని సీసీఐ కేంద్రానికి వెళ్లాడు. తీరా అక్కడకు వెళ్లిన తరువాత తెలిసింది. ఈ క్రాప్ బుకింగ్‌లో మిర్చి సాగుచేసినట్లు నమోదైందని. దీంతో వెనక్కు వచ్చి బయట తక్కువ ధరకు దళారులకు పంటను తెగనమ్ముకున్నాడు.

రైతు అసహనం.. అధికారుల మౌనం

ప్రత్తిపాడుకు చెందిన మరో రైతు 23 ఎకరాల్లో మినుము, కంది సాగు చేశాడు. వ్యవసాయశాఖ అధికారులు పొలానికి వెళ్లకుండానే ఈ-క్రాప్ బుకింగ్‌లో పత్తి పంటగా నమోదు చేశారు. తీరా ఈకేవైసీ సమయంలో ఓటీపీ అవసరం కావడంతో రైతుకు ఫోన్ చేశారు. ఆయన నేను సాగు చేసింది అపరాలు అయితే మీరు పత్తి ఎలా నమోదు చేస్తారని, క్రాప్ బుకింగ్ వద్దు, ఏమీ వద్దు అని సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశాడు. దీంతో చేసేదేమీ లేక సిబ్బంది సైలెంట్ అయిపోయారు.


ఆమడ దూరంగానే..!

- పొలాలకు వెళ్లకుండానే ఈ-క్రాప్ నమోదు
- తప్పుల తడకగా వివరాలు
- వ్యవసాయ శాఖ సిబ్బంది ఇష్టారాజ్యం
- సాగు చేసిన పంట ఒకటి, నమోదు చేసింది మరొకటి
- క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువు
- ఫీల్డ్‌లో కనిపించని వీఆర్వోలు
- కర్షకులకు తప్పనితిప్పలు



రబీలో సాగు చేసిన కూరగాయల పంట

ప్రత్తిపాడు: ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయశాఖ సిబ్బంది చేసిన ఈ-పంట నమోదు అంతా తప్పుల తడకగా ఉంది. అధికారుల నిర్లక్ష్యం కర్షకులకు శాపంగా మారింది. ఫలితంగా రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అయినా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదు. వ్యవసాయంలో ఈ-క్రాప్ నమోదు చాలా కీలకం. సాగుకు రాయితీలు, ఎరువులు, విత్తనాలు పొందాలన్నా.. ప్రకృతి విపత్తులకు పంట నష్టపోతే పరిహారం పొందాలన్నా ఈక్రాప్‌లో నమోదు కావడం చాలా అవసరం. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ-క్రాప్ నమోదుపై సరైన అవగాహన లేక రైతులు అధికారుల నిర్లక్ష్యానికి బలయ్యారు. అన్నీ తెలిసి జాగ్రత్తగా పంట నమోదు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కార్యాలయం గడప దాటకుండా ఈ-పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసిందన్న విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. వాస్తవానికి వివరాల నమోదును వీఆర్వో, వ్యవసాయాధికారులు సంయుక్తంగా చేపట్టాలి. ఈ రెండు శాఖల అధికారుల నిర్లక్ష్యం వల్ల ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులు పడ్డారు.



కొండేపాడులో ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రబీలో సాగు ఆరంభం

ఈ ఏడాది రబీ సీజన్‌లో మొత్తం 1,75,810 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, కంది పప్పు, మినుములు, పెసర, కూరగాయలు, ఆయిల్ రకాలు వంటి రకరకాల పంటలు సాగవుతాయనేది వ్యవసాయశాఖ అధికారుల అంచనా. కాగా డిసెంబరు 16 వరకు 49,785 ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. వాటిలో డిసెంబరు 21 వరకు 8,006 మంది రైతులకు సంబంధించి 22,721 ఎకరాలకు ఈ- క్రాప్ బుకింగ్ చేశారు. ఇప్పుడైనా వివరాలు సరిగా నమోదు చేస్తారా అనే మీమాంస రైతులను వెంటాడుతోంది.

రబీ పంట నమోదు ఫిబ్రవరి 25 వరకు

రబీకి సంబంధించిన ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఫిబ్రవరి 25వ తేదీలోగా ఈకేవైసీతోసహా రైతులు ఈ-పంటను నమోదు చేయించుకోవాలి.

- మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు జాబితాలు ప్రదర్శించి, గ్రామసభలు నిర్వహిస్తారు.
- మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు సామాజిక తనిఖీలు నిర్వహించి ఫిర్యాదు స్వీకరిస్తారు.
- మార్చి 15న సవరించిన పంట నమోదు తుది జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు.

రబీలోనైనా పొలాల్లో కాలుమోపేనా..?

వ్యవసాయ శాఖ ప్రత్యేక యాప్ ద్వారా పంట నమోదు చేపడుతోంది. ఈ ప్రక్రియ అంతా వ్యవసాయశాఖ సిబ్బంది, వీఆర్వోలతో కలిసి రైతు సాగు చేసిన పొలం వద్దకు వెళ్లి రైతుతోపాటు పంటను ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ వ్యవసాయశాఖ సిబ్బంది కొరతతో పాటు సిబ్బంది అలసత్వంతో ఖరీఫ్‌లో ఈ ప్రక్రియ చాలావరకూ ప్రహసనంగా సాగింది. ఇక వీఆర్వోలైతే వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి ఫీల్డ్‌కి వచ్చిన దాఖలాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. వ్యవసాయశాఖ సిబ్బంది ఇచ్చిన వివరాలనే వీఆర్వోలు కళ్లుమూసుకుని అప్రూవ్ చేసేస్తున్నారు. సిబ్బంది ఇష్టారీతిన పంట నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రబీలో అయినా పొలాలను సందర్శించి పంటల నమోదు పక్కాగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏ పంటా వేయకున్నా మిర్చి నమోదు చేశారు



ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేయాలి. ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ సిబ్బంది ఫీల్డ్‌కి వెళ్లకుండానే వివరాలు నమోదు చేశారు. నేను ఖరీఫ్‌లో ఏ పంటా సాగు చేయలేదు. భూమిని ఖాళీగా వదిలేశాను. మిర్చి పంట సాగు చేసినట్లు ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఇప్పుడు నేను శనగ సాగుచేశా. వాళ్లు తప్పుగా నమోదు చేయడం వల్ల నేను రేపు దిగుబడులు వచ్చిన తరువాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా శనగ విక్రయించుకోవాలంటే వీలుపడని పరిస్థితి. – బాపతు వెంకటేశ్వరరెడ్డి, రైతు, ప్రత్తిపాడు

పొలాలకు వెళ్లాల్సిందే..



వ్యవసాయశాఖ సిబ్బంది కచ్చితంగా పొలాలకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయాలి. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియలో తొలి దశ డెస్క్‌టాప్ వర్క్ ఉంటుంది. రెండోదశలో కచ్చితంగా సిబ్బంది పొలాలకు వెళ్లాలి. రైతుతో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇది జీపీఆర్ఎస్ ద్వారా పనిచేస్తుంది కాబట్టి ఫీల్డ్‌కి వెళ్లకుండా ఆఫీసులోనే కూర్చుని చేయడం సాధ్యపడదు. – నున్న వెంకటేశ్వర్లు, డీఏవో, గుంటూరు జిల్లా

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,400** గరిష్ఠం : రూ. **4,000**

మోడల్ ధర రూ. **3,700**

క్లుప్తంగా

యార్డుకు 76,386 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 76,386 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 73,529 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 52,093 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

వసతి సరిలేదు..సంక్షేమం కానరాదు

సమస్యల సుడిగుండంలో తాడికొండలోని వసతి గృహాలు

- కనీస మరమ్మతులు లేక గుంతలమయంగా మారిన లోగిళ్లు
- కుంగిన ఫ్లోరింగ్, మరుగుదొడ్లు అపరిశుభ్రం
- డ్రైనేజీ నీరు బయటకు వెళ్లే దారిలేక.. తాగునీరు సక్రమంగా రాక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



బాలికల వసతి గృహంలో నిర్వహణ లేక ఊడిపోతున్న మరుగుదొడ్ల తలుపులు



బీసీ బాలికల వసతి గృహంలో కుంగిన ఫ్లోరింగ్

తాడికొండ: పేద విద్యార్థులు కాసింత తలదాచుకొని పాఠశాలల్లో ఉచిత విద్యనభ్యసించేందుకు ప్రభుత్వాలు ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన సంక్షేమ వసతి గృహాలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్మాణమే తప్ప తదనంతరం వాటికి కనీస మరమ్మతులు చేసిన నాథుడు లేకపోవడంతో విద్యార్థులకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. తాడికొండ బీసీ బాలికల వసతి గృహంలో 98 మంది విద్యార్థినులు ఉంటుండగా ఇక్కడ ఫ్లోరింగ్ పూర్తిగా కుంగిపోయి ఎగుడుదిగుడుగా మారడంతో కనీసం నడవాలన్నా చిన్నారులు ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరుగుదొడ్ల తలుపులు బోల్టులు ఊడిపోయి వేలాడుతూ దర్శనమిస్తుండగా మరుగుదొడ్ల నుంచి బయటకు వెళ్లే డ్రైనేజీకి సక్రమమైన వ్యవస్థ లేని కారణంగా ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుంది. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా సమస్య పరిష్కార మైన దాఖలాలు లేని కారణంగా విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ పరిశీలనలో సైతం ఈ విషయాన్ని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకూ పట్టించుకున్న నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల బాలుర వసతి గృహంలో సైతం..

కళాశాల బాలుర వసతి గృహంలో సైతం సమస్యలు ఎక్కడికక్కడే తిష్టవేసి దర్శనమిస్తున్నాయి. నిర్మాణమే తప్ప కనీస మరమ్మతులకు కూడా నోచని కారణంగా ఎక్కడ చూసినా గోడలి బీటలు వారి కనిపించడంతో పాటు, అంతర్గత గదుల్లో ఫ్లోరింగ్ పూర్తిగా కుంగిపోయి చిన్నారులు ఎగుడుదిగుడుగా పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడటంపై పలువురు విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. మరుగుదొడ్లపై ఉన్న శ్లాబ్ పూర్తిగా పాడైపోవడంతో వర్షం పడితే మరింత ఇబ్బందిగా మారుతుందని, తాగునీరు మంచినీరు అందని కారణంగా ఉప్పు నీరు కొన్ని అవసరాలకు వాడుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వసతులతో విద్యనందించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేయడం తమను నిర్లక్ష్యం చేయడమేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూతవేటు దూరంలో సీఎం నివాసం, విద్యాశాఖా మంత్రి చేరువలో ఉన్నా తమకీ దుస్థితి నుంచి బయటపడేసే నాధుడే లేడా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి సత్వరమే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆయా వసతి గృహాల వార్డెన్లు ఏమన్నారంటే...

బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ మార్గరేట్ మాట్లాడుతూ ఇటీవల జిల్లా కలెక్టర్ పరిశీలనకు రాగా విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లామని, వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులు చేస్తామని తెలిపారు. కళాశాల బాలుర వసతి గృహం వార్డెన్ విజయ్ భాస్కర్ స్పందిస్తూ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, మరమ్మతుల నిమిత్తం రూ.23 లక్షలు మంజూరయ్యాయని, ఇటీవల ఇంజినీరింగ్ విభాగం అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారన్నారు. వేసవిలో మరమ్మతులు నిర్వహిస్తుమని చెప్పినట్లు ఆయన తెలిపారు.



కళాశాల బాలుర వసతి గృహంలో పెచ్చులూడి, ఫ్లోరింగ్ కుంగి అధ్వానంగా మారిన ఆవరణ

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: వినియోగదారుల చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ వినయోగదారుల దినోత్సవ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ మనిషి పుట్టుకతోనే వినయోదారునిగా జీవితం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి వ్యక్తి తాము కొనుగోలు చేసిన చిన్న, పెద్ద వస్తువుల నాణ్యతను చూసుకునే హక్కు ఉంటుందన్నారు. తమకు ఎలాంటి అన్యాయం జరిగినా తక్షణం వినియోగదారుల కమిషన్‌లో కేసు నమోదు చేయాలన్నారు. దీనికి ఖర్చు కూడా నామమాత్రంగానే ఉంటుందన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ ఫోరంలో నమోదు చేసిన కేసులు త్వరగానే పరిష్కారమవుతాయన్నారు. వినియోగదారుల హక్కులను వినియోగించుకుంటే వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉంటారని చెప్పారు. వినియోగదారుల హక్కుల అంశంలో చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో 36 మందికి బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో డీఎస్ఓ కోమలి పద్మ, సివిల్ సప్లయీస్ డీఎం లక్ష్మి, ఆహార భద్రతా శాఖాధికారి రవీంద్రా రెడ్డి, వినియోగదారుల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఆదామ్ సాహెబ్, వినియోగదారుల కమిషన్ సభ్యురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి ప్రమాణం



శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి సవిత

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. తాడేపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హాజరై శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, యార్లగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు అరికట్టేందుకు అధికారులందరూ సమష్టి కృషితో, ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్‌పీఆర్‌బీ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీ అడిక్షన్ సెంటర్‌లలో మాదక ద్రవ్యాలు వినియోగించి చికిత్స కోసం వచ్చే రోగుల వివరాలు పోలీసులకు అందించాలన్నారు. విద్యాసంస్థలు, పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు స్థానికులకు అవగాహనతో పాటు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు కలిపి పాఠశాలల్లో నార్కోటింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణ కోసం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మెడికల్ షాపుల్లో వైద్యుల సిఫార్సు లేకుండా మత్తు కలిగించే డ్రగ్స్ విక్రయించరాదని తెలిపారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల క్రయ, విక్రయాలను కఠినంగా అణచి వేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించేవారితోపాటు, విక్రయించేవారితో కూడా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. డీఈఓ రేణుక, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ మహబూబ్ షరీఫ్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విజయలక్ష్మి, ఫుడ్ కంట్రోల్ ఏడీ లక్ష్మణ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో క్రిస్మస్ వేడుకలు



సూచనలిస్తున్న సీఐలు రవీంద్రబాబు, వాసు, నాగుల్‌మీరా



ఆలయంలో ఏర్పాటు చేసిన పశువుల పాక

ఫిరంగిపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిరంగిపురం బాల ఏసుదేవాలయ ప్రాంగణంలో మంగళవారం అర్ధరాత్రి నిర్వహించాల్సిన వేడుకలను వర్షం వల్ల ఆలయంలో నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌర్యమూ కలుగకుండా ఉండేలా రాత్రి 11.30 గంటల నుంచి దివ్యపూజాబలి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనిపై బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి , గుడి పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరగనున్నాయి. ఆలయంలో క్రీస్తు జననాన్ని తెలియజేసేలా పశువుల పాకను అందంగా అలంకరించారు. పాక చుట్టూ విద్యుదీపాలు, నీటి కొలను సెట్టింగ్ ఏర్పాటు చేశారు.

తిరునాళ్లకు పటిష్ట భద్రత

క్రిస్మస్ సందర్భంగా గ్రామంలో నిర్వహించే బాల ఏసు ఆలయ తిరునాళ్లకు 138 మందితో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు. సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో మంగళవారం పోలీసు సిబ్బందికి విధులు కేటాయించారు. తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల స్టేషన్ల నుంచి వచ్చిన పోలీసులకు అవగాహన కల్పించారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. వాహనాల పార్కింగుకు మూడు ప్రాంతాలను నిర్ణయించినట్లు పోలీసులు వివరించారు. తిర్ల ఉత్సవానికి పకడ్బందీ చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో తాడికొండ సీఐ వాసు, మేడికొండూరు సీఐ నాగూల్ మీరా, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న పోలీసులు

- నరసరావుపేటకు చెందిన ముగ్గురు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు
- 133 మద్యం సీసాలు స్వాధీనం



నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

నెహ్రూనగర్: చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టాన్ని అతిక్రమించి జైలు పాలవుతున్నారు. గోవా రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరులో ఎక్కువ ధరకు అమ్మిస్తూ చివరకు ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డారు. గుంటూరు నగరంలోని పట్టాభిపురం ఇస్కాన్ టెంపుల్ వద్ద గోవా మద్యం అమ్ముతున్నారని వచ్చిన సమాచారం మేరకు గుంటూరు–2 టౌన్ ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి కుక్కమల్ల సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి చెప్పారు. గోవా మద్యం ఎక్కడి నుంచి వస్తుందని సురేష్‌ను విచారించగా నరసరావుపేట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కార్యాలయంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శివకృష్ణ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వాసుదేవరావు, నరసరావుపేటలో స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆనందరావులు తనకు గోవా మద్యం ఇస్తుంటారని, వారి తరఫున తాను ఎక్కువధరకు అమ్ముతానని సురేష్ ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. సురేష్ ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా కోర్టు కాంపౌండ్‌లోని ఆర్అండ్‌బీ పాడుబడిన బంగ్లాలో పోలీసులు శివకృష్ణ, వాసుదేవరావు, ఆనంద్‌రావులు నిలువచేసి దాచి ఉంచిన 133 మద్యం సీసాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. వీరిని అరెస్ట్ చేశామన్నారు. వీరందరికీ గుంటూరుకు చెందిన టి.బాజీబాబు గోవా నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి అమ్ముతుంటాడు. అక్రమ మద్యం అమ్ముతున్నాడనే విషయంలో గత కొద్దిరోజుల క్రితం బాజీబాబును(బాబీ) అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఎక్సైజ్ సీఐ యశోదరా దేవి, ఎస్ఐలు మాధవి, సత్యనారాయణ, సిబ్బంది హనుమంతరావు, రాజు, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో పౌరాణిక నాటక ప్రదర్శనలు



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

నగరంపాలెం: ఈనెల 27, 28 తేదీల్లో మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విజ్ఞాన మందిరంలో నాటక ప్రదర్శనల వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 28వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండు రోజులు ప్రదర్శనలు జరుగుతాయని అన్నారు. తొలి రోజు సాయంత్రం శ్రీరామాంజనేయ యుద్ధం (వార్‌సీను), మయసభ (దుర్యోధన ఏకపాత్ర), చింతామణి – భవాని సీను, పల్నాటి యుద్ధం (సీను), సత్యహరిశ్చంద్ర (అడవి సీను), రెండో రోజు పాండవోద్యోగం నుంచి (యుధిష్ఠిర ఏకపాత్ర), బాలనాగమ్మ (పకీరు సీను), రాజనర్తకి (ముఖ్యమైన సన్నివేశాలు), మయసభ దుర్యోధన ఏకపాత్ర, శ్రీకృష్ణ రాయబారం (సెంట్రల్ సీను), సత్యహరిశ్చంద్ర (అడవి సీను కాటి సీను వరకు) ప్రదర్శించనున్నట్లు తెలిపారు. డాక్టర్ ఎం.ఫర్నికుమార్ నిర్వహణలో పాత సినీ గీతాలాపన ఉందన్నారు. కళాభిమానులు, నాటక కళాకారులు హాజరై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చెన్నుపాటి కృష్ణారావు, సనిశెట్టి సాంబశివరావు, డాక్టర్ బీవీ.రమణ, శ్రీకాంత్, సూర్యనారాయణ, వెంకటప్పయ్య, అర్జునరావు, దర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాల్వలో దూకి జంట ఆత్మహత్యాయత్నం

ఒకరు మృతి... మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైనం



నాగరాజు(ఫైల్)

బొల్లాపల్లి: నాగార్జున సాగర్ కుడి కాలువలో ఓ జంట దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు వినుకొండ పట్టణంలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా వెల్లటూరు గ్రామానికి చెందిన గోవిందు నాగరాజు (41), వినుకొండ పట్టణంలో నివాసం ఉంటున్న వి.భార్గవి వివాహేతర సంబంధం నేపథ్యంలో విడిపోతామని మనస్థాపానికి గురై వెల్లటూరు సమీపంలోని బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఇది గమనించిన స్థానికులు కాలువలో నుంచి ఇరువురిని బయటకు తీయగా అప్పటికే నాగరాజు మృతి చెందాడు. భార్గవి వినుకొండలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఇరువురి మధ్య కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 19న ఇరువురు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంతో భార్గవి భర్త ఫిర్యాదు మేరకు వినుకొండ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. మృతుడు నాగరాజు భార్య సువర్ణలత కుటుంబ మనస్పర్థలతో నాలుగు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. మృతునికి సంతానం లేక దత్తత తీసుకోవడం జరిగింది. ఇరువురు విడిపోతామనే భయంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి బాబాయి జి.లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని వినుకొండకు పోస్టుమార్టం నిమిత్తం తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అందజేశారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



చీరాల: చీరాల రామ్‌నగర్‌లోని ఆర్టీసీ గ్యారేజి వెనుక పరిసర ప్రాంతాలలో నాటుసారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లం ఊటను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు జిల్లా ఏఈఎస్, ఇఎస్‌టీఎఫ్ బాపట్ల, చీరాల ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం రామ్‌నగర్‌లోని చర్చి వెనుక గల పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారు చేయుటకు ఉపయోగించేందుకు డ్రమ్ములలో సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.

జనవరి 30న విజ్ఞాన్ ఫార్మసీలో అంతర్జాతీయ సదస్సు



కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ లావు రత్తయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జనవరి 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసబాబు మాట్లాడుతూ 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్– ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్' అనే అంశంపై మూడు రోజుల పాటు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సను 'నెక్స్‌జెన్ ఫార్మా కనెక్ట్–2025' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్, గౌరవ అతిథులుగా ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకటరమణ, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విల్లియం కారే హాజరవుతారని తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈఓ డాక్టర్ జగదీష్ బాబు రంగిసెట్టి, గౌరవ అతిథులుగా హైదరాబాద్ బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో–ఫౌండర్ డాక్టర్ మానిక్ రెడ్డి పుల్లగుర్ల, హైదరాబాద్ జెనరా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల హాజరవుతారని తెలిపారు. చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్యతో పాటు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస బాబు, డీన్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో పమిడిపాడు ఎడ్ల ప్రతిభ

- స్వర్ణలో జూనియర్ ఎడ్ల బండి పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు



రాష్ట్రస్థాయి మైసూరు ఎడ్ల బండి పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

కారంచేడు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మండలంలోని స్వర్ణ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండి పరుగు పోటీల్లో బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నిర్వాహకుల వివరాల మేరకు.. స్వర్ణ గ్రామ ఎస్సీ కాలనీ వాసులు మేరీమాత ఆశీస్సులతో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మైసూరు ఎద్దుల టైరు బండి పరుగు పందేలు (జూనియర్ విభాగంలో) నిర్వహించారు. పోటీల్లో మొత్తం 25 జతల ఎడ్లు వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యాయి. స్వర్ణ–దగ్గుబాడు రోడ్డులో 1.5 కిలోమీటర్ల దూరాన్ని బండితో తక్కువ సమయంలో ఛేదించిన ఎడ్లకు స్థానాలను బట్టి బహుమతులు అందించారు. దీనిలో పమిడిపాడుకు చెందిన నల్లమోతు సాయిహర్ష ఎడ్ల జత 4.44.99 నిమిషాల్లో లక్ష్యాన్ని సాధించి ప్రథమ స్థానంలో నిలిచి రూ.20 వేలు గెలుపొందింది. బాపట్ల మండలం చెరువు జమ్ములపాలేనికి చెందిన పార్వతీదేవి అమ్మవారి ఎడ్ల జత 4.52.45 నిమిషాల్లో లాగి రెండో స్థానంలో నిలిచింది. రూ.15 వేలు గెలుచుకుంది. స్వర్ణ గ్రామానికి చెందిన దుర్గారావు ఎడ్ల జత 4.57.61 నిమిషాల్లో గమ్యాన్ని చేరి మూడో స్థానంలో నిలిచింది. ఈ ఎడ్లకు రూ.10 వేలు బహుమతి అందించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు గ్రామానికి చెందిన చెన్నకేశవస్వామి ఎడ్ల జత 5.10.13 నిమిషాల్లో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఎడ్లకు రూ.5 వేల బహుమతులు అందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా గవిని కృష్ణ, హైస్కూల్ పీడీ కట్టా ప్రసాద్, ఎస్ఆర్‌కే ప్రసాద్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాకులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.